

అనుసరిద్దాం... ఆదరిద్దాం

గిడుగు రామ్మూర్తి వ్యవహారిక భాషా ఉద్యమానికి ఊపిరిలూదారు. వారి వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న జిల్లా వాసులు తెలుగును వెలిగించడానికి కృషి చేస్తున్నారు. -8లో



పెట్రోల్ బంక్ సొమ్ము కేసులో విచారణ

రాజంపేట ఆర్టీసీ పెట్రోలు బంక్‌లో రూ.65 లక్షలు స్వాహా అయినట్లు నిర్ధారణ చేసుకొని జిల్లా ఎస్పీకి ఆర్టీసీ డీపీటీఓ ఫిర్యాదుచేశారు. దీనిపై విచారణ వేగమంతమైంది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.300	రూ.360
రెండోరకం	రూ.200	రూ.290

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 73 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

‘జవహర్ నవోదయ’లో మార్పులకు అవకాశం

రాయచోటి జగదాంబసెంటర్: 2026–27 విద్యా సంవత్సరం 6వ తరగతిలో ప్రవేశానికి జవహర్ నవోదయ విద్యాలయ ఎంపిక పరీక్ష–2026 కోసం ఇది వరకు నమోదు చేసుకున్న అభ్యర్థుల మార్పులకు అవకాశం కల్పించారు. ఈ విషయాన్ని వలసపల్లి జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ ఎం.గీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేటగిరీ, ఏరియా, పరీక్షా మాధ్యమంలో మార్పులకు సంబంధించి ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ తెలిపారు.

రాష్ట్ర అనుబంధ విభాగాల్లో నియామకాలు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లాకు చెందిన దిగువ పేర్కొన్న నాయకులను పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో వివిధ హోదాల్లో నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ఎస్సీ విభాగం కార్యదర్శులుగా రాజంపేట నియోజకవర్గానికి చెందిన దండు గోపి, రాయచోటి నియోజకవర్గానికి చెందిన చుక్కా అంజనప్ప, రాష్ట్ర సాంస్కృతి విభాగం ప్రధాన కార్యదర్శిగా తంబళ్లపల్లెకు చెందిన నారపురెడ్డి సుదాకర్‌రెడ్డిలను నియమించారు.

ఒంటిమిట్టలో ముగిసిన ధ్వజస్తంభ జీర్ణోద్ధరణ



పూర్ణకుంభంతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో గురువారం ఉదయం పూర్ణాహుతితో ధ్వజస్తంభ జీర్ణోధరణ శాస్త్రోక్తంగా ముగిసింది. ఇందులో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేలుకొల్పి అర్చన జరిపారు. ఉదయం 9 గంటలకు ఆలయంలోని యాగశాలలో వైదిక కార్యక్రమాలు, వాస్తుహోమం, కుంభస్థాపన, సయ్యాదివాసం, తత్వహోమాలు, పూర్ణాహుతి కళాకర్షణ జరిపారు. ఈనెల 27న సాయంత్రం ఆరుగంటలకు ధ్వజస్తంభ జీర్ణోద్ధరణకు అంకురార్పణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ ప్రశాంతి, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్ పాల్గొన్నారు.

జిల్లాలో టమాటా ఫంక్షనల్ మార్కెట్లు ఏర్పాటు

రాయచోటి జగదాంబసెంటర్: అన్నమయ్య జిల్లాలో ఐదు టమాటా ఫంక్షనల్, ఐదు నాన్ ఫంక్షనల్ మార్కెట్‌యార్డులు ఏర్పాటు చేసినట్లు జిల్లా అగ్రి ట్రేడ్–మార్కెటింగ్ అధికారి పసుపులేటి గోపి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్‌యార్డుల్లో వ్యవసాయ ఉత్పత్తులు, అమ్మకం, కొనుగోలు కోసం ఈ–నామ్ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. దీని ద్వారా మార్కెట్ చార్జీలు మినహా ఎలాంటి అదనపు తగ్గింపులు లేకుండానే రైతు సంఘం వారీగా పంట ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో పోటీతత్వ లాభదాయకమైన ధరను పొందగలుగుతారని తెలిపారు. జిల్లాలోని మదనపల్లె, వాల్మీకిపురం, కలికిరి మార్కెట్‌యార్డుల్లో ఈ పథకం విజయవంతంగా అమలవుతోందని చెప్పారు. రాయచోటిలోని రైతు బజార్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు బజార్లో ప్రత్యేక కౌంటర్ ద్వారా కందిపప్పు, బియ్యం తక్కువ ధరకు అమ్మకాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

ఎరువులు అధికధరలకు విక్రయిస్తే చర్యలు



ఎరువుల దుకాణాన్ని నిఖీ చేస్తున్న విజిలెన్స్, అగ్రికల్చర్ అధికారులు

ఒంటిమిట్ట: ఎరువుల దుకాణాలలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే యూరియాను విక్రయించాలని విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, డీసీపీఓ గీతావాణి, కడప సహాయ వ్యవసాయ సంచాలకుడు సురేష్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం ఒంటిమిట్ట మండలంలోని ఎరువుల దుకాణాలను వారు ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎరువులు అధిక ధరలకు విక్రయించినట్లు రుజువైతే వారి లైసెన్సు రద్దు చేస్తామన్నారు. రైతులు రసాయనిక ఎరువులను అవసరం మేరకు మాత్రమే వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మంజులరాణి, సివ బాబు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లంబోదర.. భక్త మందార

భక్తకోటిని దీవించేందుకు బొజ్జ గణపయ్య తరలివచ్చారు. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన మండపాల్లో కొలువుదీరి అభయమిస్తున్నారు.విభిన్న ఆకృతులతో రూపొందించిన వైవిధ్యభరితమైన విగ్రహమూర్తులు నిత్యపూజలు అందుకుంటున్నాయి. బుధవారం నుంచి మొదలైన చవితి సంబరాలు అంబరాన్నంటాయి. దండాలయ్యా..దీవించయ్యా..జైజై గణేషా.. జయములివ్వు గణేశా..లంబోదర.. భక్తమందార అంటూ వాడవాడల వినాయకుడి పాటలు,శ్లోకాలు మారుమోగుతున్నాయి. మండపాల వద్ద భక్తుల సందడి హోరెత్తుతోంది.

- ఘనంగా చవితి వేడుకలు
- జిల్లాలో 4150 విగ్రహాల ఏర్పాటు



రాయచోటి: పాత పోస్టాఫీసు వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడు



మదనపల్లె సిటీ: నక్కలదిన్నెలో పార్వతి తనయగా వినాయకుడు

రాయచోటి: జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పోటాపోటీగా నెలకొల్పిన భారీ విగ్రహాలు ఆకర్షణీయంగా నిలిచాయి. గణేష్ మంటపాలను నిర్వాహకులు విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పూజా కార్యక్రమాలు చేపట్టారు. రాత్రి వేళల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి.మొదటిరోజు బుధవారం బొజ్జగణపయ్యను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. జిల్లాలోని రాయచోటి, మదనపల్లె, పీలేరు, రాజంపేట, కోడూరు, బి కొత్తపేట, తంబళ్లపల్లి పట్టణాల్లోని ప్రధాన సెంటర్లలో భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. రామాపురం మండల కేంద్రంలో కొలువుదీరిన వినాయకుడికి మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి, జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలలో ఆయా ప్రాంతాల్లోని రాజకీయ నేతలు, ప్రజా ప్రతినిధులు గణపయ్యకు పూజలు నిర్వహించారు.

4150 గణనాథులు


జిల్లాలో 4150 గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నారు. రాజంపేట డివిజన్ పరిధిలో 1150, రాయచోటి డివిజన్ పరిధిలో 1700, మదనపల్లె డివిజన్ పరిధిలో 1300 విగ్రహాలు కొలువుతీరినట్లు పోలీసులు చెబుతున్నారు.

గడ్డితో వినాయకుడు

వినాయక చవితి సందర్భంగా రాయచోటి పట్టణం హరినాథ వీధి ఆలయ ప్రాంగణంలో ప్రకృతి సిద్ధంగా లభించే పచ్చగడి, పూలతో వినాయకుడి విగ్రహాన్ని తయారు చేశారు. ఈ విగ్రహం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే మదనపల్లె, రాజంపేట, కోడూరు ప్రాంతాల్లో ఆకట్టుకునే విధంగా వివిధ రూపాల్లో వినాయకుడు దర్శనమిస్తూ ఆశీస్సులు అందిస్తున్నారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా అనేక ప్రైవేటు సంస్థల వారు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశారు.



పూరిజగన్నాథ రథయాత్ర సెట్టింగ్‌లో బలరాముడు,కృష్ణుడితో గణపయ్య



సుండుపల్లె: దక్షిణాముఖ వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు



పాత రాయచోటి వాల్మీకివీధిలో అర్ధనారీశ్వరుడి రూపంలో స్వామివారు



రాయచోటి: హరినాథ వీధిలో కొలువుతీరిన ప్రకృతి గణపయ్య



ఓబులవారిపల్లె: ప్రత్యేక అలంకరణలో గణనాథుడు

భక్తుల పాలిట కొంగుబంగారం ఆరోగ్యమాత

- కడప వేలాంగణిగా విశేష గుర్తింపు
- నేటి నుంచి పది రోజులపాటు తిరుణాల మహోత్సవం

కడప సెవెన్‌రోడ్స్ : కడప రైల్వేస్టేషన్ సమీపంలో వెలిసిన ఆరోగ్యమాత భక్తుల పాలిట కొంగుబంగారంగా అలరారుతోంది. నగరంలోని ప్రముఖ క్రైస్తవ మందిరాలలో ఇదొకటి. బ్రిటీషు పాలనలో నిర్మించిన ఈ చర్చి కాలక్రమంలో పెద్ద చర్చిగా వెలిసింది. ఇటీవల ఆ ప్రాంగణంలో అధునాతనంగా మరో పెద్ద చర్చిని నిర్మించారు. అర్ధ చంద్రాకారంలో రెండు అంతస్థులుగా రూపుదిద్దుకున్న ఈ చర్చిలో ఒక్కొక్క అంతస్తులో 1200 మందికి చొప్పున ఒకేసారి ప్రార్థనలు చేసుకునే వీలుంది. దక్షిణ భారతదేశంలో చర్చిల నిర్మాణంలో సిద్ధహస్తులైన కడపకు చెందిన ప్రముఖ ఇంజనీరు వెంకటేశ్వర్లు ఈ చర్చిని విశిష్టంగా డిజైన్ చేశారు. ఈ చర్చికి పెద్ద సంఖ్యలోనే విశ్వాసులు ఉన్నారు. భక్తులు ఆరోగ్యమాత పుణ్యక్షేత్రాన్ని కడప వేలాంగిణిగా భావిస్తారు. ఏటా ఆరోగ్యమాత తిరునాల మహోత్సవాన్ని పది రోజులపాటు ఎంతో ఘనంగా నిర్వహిస్తారు.

నేటి నుంచి ఉత్సవాలు: ఆరోగ్యమాత ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. సాయంత్రం 5.00 గంటలకు పతాకావిష్కరణ, నవదిన ప్రారంభ వేడుకలు, దివ్య బలిపూజ నిర్వహించనున్నారు. కడప పీఠాధిపతి సగినాల పాల్ ప్రకాశ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. అలాగే సెప్టెంబరు 7, 8 తేదీల్లో తిరునాల మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. 8వ తేది ఉదయం 8.30 గంటలకు విశాఖపట్టణం అగ్రపీఠం విశ్రాంత అగ్రపీఠాధిపతులు మల్లవరపు ప్రకాశ్ ఆధ్వర్యంలో మహోత్సవ సమిష్టి దివ్య బలిపూజ కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.ఉత్సవాలు ముగిసే వరకు ప్రతిరోజు వివిధ ప్రాంతాలకుచెందిన మత పెద్దలు దైవ సందేశాన్ని అందజేయనున్నారు.



విద్యుద్దీప వెలుగుల్లో ఆరోగ్యమాత చర్చి

వ్యాపార సౌలభ్యానికి చేయూత



మాట్లాడుతున్న మదనపల్లె సబ్ కలెక్టర్ కళ్యాణి

రాయచోటి: సులభతర వ్యాపారంపై భారత ప్రభుత్వం నిర్వహించే సర్వేలో సానుకూల స్పందన వల్ల జిల్లాకు మరిన్ని పెట్టుబడులు సాధ్యమని, ఇందుకు జిల్లా యంత్రాంగం చేయూతనందిస్తుందని మదనపల్లె సబ్ కలెక్టర్ కళ్యాణి పేర్కొన్నారు. గురువారం రాయచోటి కలెక్టరేలోని పీజీఆర్ఎస్ హాల్లో మదనపల్లె సబ్ కలెక్టర్ అధ్యక్షతన బిజినెస్ రిఫార్మ్ యాక్షన్ ప్లాన్ 2024 అవుట్ రీచ్ కార్యక్రమాన్ని జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తూ, దేశవ్యాప్తంగా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో అగ్రస్థానాన్ని సాధించిందని గుర్తు చేశారు. జిల్లా పరిశ్రమల అధికారి కె.కృష్ణకిశోర్, కేపీఎంజీ ప్రతినిధి రవితేజలు జరుగుతున్న బిఆర్ఏపీ 2024లో 453 సంస్కరణలు అమలు తదితర వాటిపై వివరించారు. కార్యక్రమంలో పరిశ్రమ సంఘాలు, సింగిల్ డెస్క్ యూజర్స్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అధ్వానంగా ఆంధ్రా ఊటీ ఘాట్‌రోడ్డు

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రమైన ఆంధ్రాఊటీ హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డు అధ్వానంగా తయారైంది. ఎగిరిపోయిన తారు, గుంతలు, మధ్యలో చీలిన రోడ్డు ఇలా దరిద్రంగా మారిన ఘాట్‌రోడ్డుతో పర్యాటకులు అసహనానికి గురవుతున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి ప్రముఖులు, కేంద్ర, రాష్ట్రాలకు చెందిన వీవీఐపీలు, మంత్రులు, ప్రభుత్వ స్థాయి వ్యక్తులు ఇక్కడికి వచ్చి విడిదిచేసి వెళ్తుంటారు. ఘాట్‌రోడ్డు బాగుంటే రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండటమే కాకుండా ప్రమాదాలను అరికట్టే వీలుంటుంది. అయితే ప్రభుత్వం ముఖ్యమైన పర్యాటక కేంద్రానికి వెళ్లే ఘాట్‌రోడ్డుపై నిర్లక్ష్యం చూపుతోంది. జిడ్డు కృష్ణమూర్తి సర్కిల్‌లో రహదారిపై పొడవుగా నిలువునా చీలినట్టు గంతలు పడ్డాయి. ఇటీవల కొండపై జరిగిన అభివృద్ధి పనుల కోసం రోడ్డును తవ్వేశారు. దీనిని అభివృద్ధి చేయలేదు. దీనిపై రాకపోకలు సాగించే బైక్‌లు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. అలాగే ఘాట్‌రోడ్డుపై పలుచోట్ల తారు లేచింది. రహదారి భవనాలశాఖ అధికారులు రోడ్లు మరమ్మతులు చేయించడంతోపాటు ఘాట్ రోడ్డుపై కొత్త రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పర్యాటకులు కోరుతున్నారు.



హార్సిలీహిల్స్‌పై దెబ్బతిన్న రోడ్డు



రోడ్డు తవ్వి వదిలేశారు

సెప్టెంబరు 1న రాజంపేటకు ముఖ్యమంత్రి రాక



రాజంపేటలో హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాజంపేట: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సెప్టెంబరు1న రాజంపేటకు రానున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సీఎం సభ, హెలిప్యాడ్ స్థలాన్ని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పరిశీలించారు. లబ్ధిదారులకు ఫించన్ల పంపిణీ సభలో సీఎం ప్రసంగించనున్నారు. అనంతరం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలో సమావేశం కానున్నారు. బోయనపల్లె, ఎంజీపురం, ఊటుకూరు, కూచివారిపల్లె పంచాయతీలోని ఎన్టీఆర్ కాలనీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సీటీ కల్యాణ మండపం వద్ద ఉన్న స్థలాన్ని , తోట కల్యాణ మండపాన్ని , బోయనపల్లె ప్రభుత్వ హైస్కూల్ క్రీడామైదానాన్ని పరిశీలించారు. సీఎంఓ భద్రత సిబ్బంది రాజంపేటకు చేరుకొని సభా స్థలాన్ని, హెలిప్యాడ్ ఖరారు చేసి సీఎం షెడ్యూల్‌ను విడుదల చేయనున్నారని రెవెన్యూ వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, సబ్‌కలెక్టర్ భావన , ఎఎస్పీ మనోజ్‌రామ్‌నాథ్ హెగ్డే, క్షత్రియ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ అద్దెపల్లె ప్రతాప్‌రాజు, తాళ్లపాకు చెందిన ఉద్దండం సుబ్రమణ్యం, శివనారాయణచౌదరి, అదృష్టదీపుడు, తహసీల్దారు పీరుమున్నీ, ఎంపీడీఓ వరప్రసాద్, ఆర్అండ్‌బీ ఈఈ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా గురువారం సబ్‌కలెక్టర్ భావన సభాస్థలిని పరిశీలించారు.

అదిగో పులి!

- నాగార్జునసాగర్– శ్రీశైలం టైగర్ కారిడార్ నుంచి మన అడవుల్లోకి పులులు
- తాజాగా చిట్వేలి అడవుల్లో కనిపించిన పెద్దపులి



కెమెరా కంటికి చిక్కిన పెద్దపులి

సాక్షి రాయచోటి: జంతువులకే రాజుగా భావించే పెద్ద పులి కనిపించింది. చిట్వేలి పరిధిలోని అడవుల్లో దర్శనమిచ్చింది. అయితే ఇదేం కొత్తకాదు... ఉమ్మడి కడపజిల్లాలోని అటవీ ప్రాంతంలో గతంలోనూ పెద్ద పులులు కనిపించాయి. గతంలో అటవీశాఖ పులుల గణన సందర్భంగా కూడా నాలుగు పెద్ద పులులు జిల్లాలో కనిపించినట్లు లెక్క తేల్చారు. ప్రధానంగా నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ కారిడార్ ప్రాంతంలో ఉన్న పులులు నిమ్మదిగా అడువులను తిరుగుతూ ఇటువైపుకు మళ్లాయి. గతంలోనూ నంద్యాల గుండ్ల మల్లేశ్వరం అటవీ ప్రాంతం నుంచి లంకమల అభయారణ్యంలో కెమెరాలకు దొరికిన సంగతి అందరికీ తెలిసిందే. తాజాగా అన్నమయ్య జిల్లా పరిధిలోని పెనుశిల అభయారణ్యంలో కనిపించడంతో మళ్లీ పెద్ద పులుల మాట హాట్ టాపిక్‌గా మారింది.


అటు నుంచి ఇటు...

నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ కారిడార్ నుంచి మహానంది, నంద్యాల ప్రాంతాల్లోని అడువులతో పాటు లంకమల, పెనుశిల, నల్లమల, శేషాచలం అడవుల్లో కలియతిరుగుతూ పెద్ద పులులు మన అడవుల్లో దర్శనమిస్తున్నాయి. అటు నుంచి ఇటు, మళ్లీ ఇటు నుంచి అటు వెళుతుండడంతో అడవుల్లో అటవీ శాఖ అమర్చిన కెమెరాల్లో అప్పుడప్పుడు దొరికిపోతున్నాయి. ఇప్పటికే వైఎస్సార్, అన్నమయ్య జిల్లా పరిధిలోని సుమారు 50–60 ఉన్నట్లు అటవీఅధికారులు అంచనా వేస్తున్నారు. అయితే పెద్ద పులులు కూడా మన అడవుల్లో కనిపిస్తుండడంతో టైగర్ కారిడార్ పరిధి విస్తరణకు కూడా గతంలో అధికారులు చర్యలు తీసుకున్నారు.

అన్నమయ్యలో 4.69 లక్షల హెక్టార్లలో అడవి

జిల్లా పరిధిలో నల్లమల, శేషాచలం, ఎర్రమల, పెనుశిల, లంకమల, పాలకొండలు ఇలా అనేక పెద్ద అడవులు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 4.69 లక్షల హెక్టార్లలో అడవి విస్తరించి ఉంది. అడవుల్లో సుమారు వెయ్యి రకాలకుపైగా వివిధ రకాల పక్షులు, జంతువులు నివసిస్తున్నాయి. ప్రధానంగా అరుదైన జంతువుగా ముద్రపడిన పంగోలిన్, హనీ బగ్గల్ లాంటివి కూడా ఇక్కడ కనిపించాయి. శేషాచలం అడవుల్లో ఎక్కువగా ఏనుగల గుంపులు ఉన్నాయి. నీటికోసం బయటికి వచ్చినపుడు కనిపిస్తున్నాయి. మరోవైపు చిరుతల సంచారంతోపాటు పులులు, ఇతర అనేక జంతువులకు ఆవాసంగా మన అడవులు కనిపిస్తున్నాయి.

కెమెరా కంటికి పెద్దపులి



జిల్లా పరిధిలోని చిట్వేలి టైగర్ ప్రాజెక్టు కారిడార్‌లో పెద్ద పులి కనిపించింది. ఇటీవల అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కెమెరాల్లో చిక్కింది. నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వు ఫారెస్టునుంచి పెద్ద పులి చిట్వేలి కారిడార్‌లోకి ప్రవేశించినట్లుగా భావిస్తున్నాం. పెద్ద పులి అడవుల్లో తిరుగుతున్న దృశ్యాలు లభ్యమయ్యాయి.

– వివేక్, ఇన్‌ఛార్జి జిల్లా అటవీశాఖ అధికారి, అన్నమయ్యజిల్లా

సెప్టెంబరు 11, 12 తేదీల్లో కళా ఉత్సవ్

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లా స్థాయి కళా ఉత్సవ్ – 2025 పోటీలు సెప్టెంబర్ 11, 12 తేదీల్లో రాయచోటి డైట్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు అన్నమయ్య, కడప జిల్లాల విద్యాశాఖాధికారులు సుబ్రహ్మణ్యం, షంషుద్దీన్ తెలిపారు. గురువారం కడప డీఈవో కార్యాలయంలో కళా ఉత్సవ్ – 2025 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాత్ర సంగీతం, వాయిద్య సంగీతం, నృత్యం, నాటకం, దృశ్య కళలు, సాంప్రదాయ కథ చెప్పడం వంటి 6 విభాగాలలో 12 అంశాల నందు పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 9, 10, 11, 12 తరగతుల విద్యార్థులు ఈ పోటీలకు అర్హులని వివరించారు. పూర్తి వివరాల కోసం కళా ఉత్సవ్ జిల్లా నోడల్ అధికారి మడితాటి నరసింహారెడ్డి 9440246825ని సంప్రదించాలని సూచించారు.

వైవీయూలో నృత్య, సంగీత కోర్సులలో ప్రవేశాలు

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వ విద్యాలయంలోని లలిత కళలశాఖ ఆధ్వర్యంలో కూచిపూడి, కర్నాటక సంగీతం, కీబోర్డు, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలను ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభించినట్లు డైరక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ టి.లక్ష్మిప్రసాద్ తెలిపారు. ప్రవేశాల ప్రక్రియ సెప్టెంబర్ 12 వరకు కొనసాగుతుందన్నారు. పదేళ్లు నిండిన వారి నుంచి తర్వాత ఏ వయసు వారైనా ఈ కోర్సుల్లో చేరవచ్చని పేర్కొన్నారు. వివరాలకు www.edu.in ను సంప్రదించాలని సూచించారు. అలాగే 9032595101 నంబరుకు ఫోన్ చెయ్యవచ్చన్నారు.

క్లుప్తంగా

వినాయక చవితి ఉత్సవాల్లో అపశృతి

– కాలిబూడిదైన గణేష్ మండపం



మంటల్లో కాలిపోతున్న గణేష్ మండపం

పీలేరు : వినాయక చవితి ఉత్సవాల్లో అపశృతి చోటుచేసుకుంది. వివరాలిలావున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అన్నమయ్య జిల్లా పీలేరు పట్టణంలోని బీవీ రెడ్డి నగర్ సమీపంలో ఎల్‌బీఎస్ రోడ్డులో స్థానిక భక్తులు గణేష్ మండపంలో విగ్రహం ఏర్పాటు చేసి పూజలు ప్రారంభించారు. అయితే దీపం ఒరిగి ఒక్కసారిగా మండపానికి మంటలు వ్యాపించి పూర్తిగా కాలిబూడిదైంది. అనంతరం భక్తులు ఆ స్థానంలో కొత్త విగ్రహం, మండపం ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు.

ముగ్గురికి గాయాలు



గాయపడిన చౌడప్ప

ములకలచెరువు : ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలైన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు... కొండ కింద రైల్వేగేట్ వద్ద జరిగిన ఈ ప్రమాదంలో పెద్దపాళ్యం పంచాయతీ రామానాయుని కోటకు చెందిన చౌడప్ప(50), దేవలచెరువు పంచాయతీ గోళ్లారిపల్లెకు చెందిన శైలజ(17), మమత(15)లకు తీవ్రగాయాలయ్యాయి. 108 సహాయంతో వీరిని మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గోడమీద పడి రైతుకు గాయాలు



గాయపడిన రైతు భాస్కరరెడ్డి

మదనపల్లె రూరల్ : వర్షానికి తడిసిన గోడ మీద పడి రైతు గాయపడిన ఘటన గురువారం ములకలచెరువు మండలంలో జరిగింది. దేవలచెరువు పంచాయతీ చెన్నువారిపల్లెకు చెందిన మల్లారెడ్డి కుమారుడు భాస్కరరెడ్డి(36) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. గురువారం సాయంత్రం ఆవుల కొట్టంలో పనులు చేస్తుండగా, వర్షానికి తడిసిన గోడ ఒక్కసారిగా మీదపడడంతో గాయపడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు బాధితుడిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బాధితుడిని తిరుపతికి రెఫర్ చేశారు.

అనుసరిద్దాం... ఆదరిద్దాం



తేనెలూరే తెలుగు.. అందుకే దేశ భాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణదేవయాలు కీర్తించారు. కమ్మనైన పద్యం, శ్రవాణానందం కలిగించే అవధానం..వినసొంపైన పద సంపద అమ్మభాషకు ఆభరణాలు. గిడుగు రామ్మూర్తి పంతులు వ్యవహారిక భాషా ఉద్యమానికి ఊపిరిలూదారు. వారి వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న జిల్లా వాసులు తెలుగును వెలిగించడానికి శాయశక్తులా కృషి సాగిస్తున్నారు. శుక్రవారం తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా వారి సేవలను గుర్తు చేసుకోవడం ముదావహం. – మదనపల్లె సిటీ

• తెలుగు పూలు పూయిద్దాం • నేడు తెలుగు భాషా దినోత్సవం

• తెలుగుభాషాభివృద్ధి కోసం కృషి



మదనపల్లె పట్టణం రామారావుకాలనీకి చెందిన టీఎస్‌ఏ కృష్ణమూర్తి మున్సిపాలిటీలో ఉద్యోగ విరమణ చేసినా ఇప్పటివరకూ తెలుగుభాషాభివృద్ధికోసం అవిశ్రాంత కృషి చేస్తున్నారు. 1968 నుంచి కథలు, నవలలు రాయడం ప్రారంభించి ఉత్తమ నవలా రచయితగా ఖ్యాతి గడించారు. 200 కథలు, 10 నవలికలు, 5 నవలలు, కథా సంపుటాలు రచించారు. ఆయన రచించిన కొత్త బంగారులోకం నవల పేరు తెచ్చి పెట్టింది. ఈ నవలకు తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం, సీపీ బ్రౌన్ అకాడమీ, స్వాతి పురస్కారాలు అందుకున్నారు. కుప్పం రెడ్డమ్మ సాహితీ అవార్డు, నెల్లూరు బలరామయ్య అవార్డు, విజయవాడ సోమేపల్లె సాహితీ పురస్కారాలు దక్కాయి. అడ్డదారులు, కథా సంపుటి, కలువ విరిసింది, కలల రాజ్యం నవలలు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చాయి. తరచూ గ్రంథాలయాలు, పాఠశాలలకు వెళ్లి తెలుగు భాష గొప్పతనాన్ని గురించి వివరిస్తున్నారు.

• అభినవ బాల కవులతో భాషాభివృద్ధికి కృషి



మదనపల్లె పట్టణం గొల్లపల్లికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు ఈశ్వరయ్య తెలుగుభాషాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు. తాను స్వతహాగా కవిగా రాణిస్తుడంటంతోపాటు పాఠశాలకు చెందిన విద్యార్థులతో కవిత్వం, కథలు రాసేలా ప్రేరణనిస్తున్నారు. విద్యార్థులతో పలు నాటక ప్రదర్శనలు చేయిస్తున్నారు. పలు సినిమాలకు పాటలు కూడా రాశారు. పలు అవార్డులు అందుకున్నారు.

• తెలుగుభాష గొప్పతనం తెలియజేస్తున్నా



ఉపాధ్యాయుడిగా పదవీ విరమణ చేసిన తెలుగుభాషపై మక్కువతో ఇప్పటికీ నేటి తరం విద్యార్థులకు భాష గురించి వివరిస్తున్నారు వీఎం.నాగరాజు. మదనపల్లె పట్టణం సొసైటీకాలనీకి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు నాగరాజు వందల సంఖ్యలో దృశ్య కవితలు, పద్యాలను రచించి నేటితరం విద్యార్థులకు అందిస్తున్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో పాల్గొని విద్యార్థులకు తెలుగుభాష గొప్పతనాన్ని తెలియజేస్తున్నారు.

• గజల్స్‌లో దిట్ట అంజలి



మదనపల్లె పట్టణం రెడ్డీస్ కాలనీలో నివాసమున్న అంజలి ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. ఆమెకు కవితలు, గజల్స్, రుబాయిలు, పద్యాలు రాయడం అలవాటు. ఇప్పటి వరకూ 40 గజల్స్ రాశారు. ప్రత్యేకించి రుబాయిలు (ప్రశ్నించడం) రాయడం ఆమె ప్రత్యేకత. కత్తులు కదం తొక్కిన రోషమెక్కడ? దిక్కులన్నీ ఒక్కటైన రోషమెక్కడ? నెత్తుటి కుతకుతలే మాయో అంజలి? అంటూ తన రుబాయిల్లో ప్రశ్నల వర్షం కురిపిస్తుంటారు. చైతన్యవంతమైన సమాజం కోరి రచనలు చేయడం ఈమె అభిమతం. అణగారిన, బడుగు, బలహీన వర్గాలు, అమాయక ఆడపిల్లల పట్ల చూపుతున్న వివక్ష పట్ల గళమెత్తే అక్షరమై ఆ కలం వెలుగొందుతుందని అంజలి అంటున్నారు. ఈమె రచనలకు పలు పురస్కారాలు లభించాయి.

• కథావనంలో భారతి



ఎండపల్లి భారతి నిమ్మనపల్లె మండలం దిగువ బురుజు. ఆవులు, సేద్యం, అక్షరం ఇది ప్రతి రోజూ దినచర్య. పేపర్, పెన్ను ఆమె కొంగులతో ముడిపడి ఉంటాయి. ఎప్పుడు ఆలోచన వస్తే అప్పుడు పేపర్ తీసి రాస్తారు. తాను చూసింది, వినింది, అనుభవించిందే రాస్తారు. భవిష్యత్తు తరాలకు గ్రామీణ జీవనం, పల్లెయాస, మాండలికం బతికిబట్ట కట్టాలనేది ఆమె తాపత్రయం. ఆమె రాసిన ఎదారి బతుకులు, బతుకీత, జాలారిపూలు మంచిపేరు తెచ్చిపెట్టాయి. ఆమె 2018లో గిడుగు రామమూర్తి పురస్కారం, 2019 లో చంద్రశేఖర్ సాహితీ పురస్కారం, 2020లో గార్లపాటి పురస్కారం, 2022లో విమలాశాంతి పురస్కారాలు అందుకున్నారు. 29న రాజమండ్రిలో ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో హంస పురస్కారం అందుకోనున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

మదనపల్లె రూరల్ : మహిళ మెడలో గొలుసు చోరీ చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ మహమ్మద్ రఫీ తెలిపారు. పట్టణంలోని సొసైటీ కాలనీ రాములవారిగుడివీధిలో నివాసముంటున్న శ్రీనివాసులు భార్య సరస్వతి మంగళవారం రాత్రి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సమీపంలో నడిచి వస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్రవాహనంపై వేగంగా వచ్చి మెడలోని బంగారు గొలుసు చోరీ చేసి అక్కడి నుంచి పారిపోయాడు. బంగారు గొలుసు విలువ రూ.1.5 లక్షల విలువ ఉంటుందని బాధితురాలు వన్ టౌన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ అన్సర్‌బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఐదుగురికి గాయాలు



గాయపడిన చంద్రశేఖర్

మదనపల్లె రూరల్ : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. పట్టణంలోని బాలాజీ నగర్‌కు చెందిన నరేంద్రబాబు(30), భార్గవ్(31) వ్యక్తిగత పనులపై గుర్రంకొండకు వెళ్లి బుధవారం తిరిగి మదనపల్లెకు వస్తున్నారు. తట్టివారిపల్లె సమీపంలోని చెరువుకట్టపై కుక్క అడ్డు రావడంతో అదుపు తప్పి తీవ్రంగా గాయపడ్డారు. అదే విధంగా గుర్రంకొండ మండలం ఉసిరికాయలపల్లెకు చెందిన పద్మావతమ్మ, మరోవ్యక్తితో కలిసి బైక్‌పై వస్తున్నారు. గ్రామ సమీపంలో ఆటో ఎదురుగా రావడంతో ద్విచక్రవాహనాన్ని అదుపుచేయలేక కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. అదే విధంగా చిత్తూరు జిల్లా పలమనేరు మండలం కొలమాసనపల్లె పంచాయతీ ఎం.కల్నాడు గ్రామానికి చెందిన బి.చంద్రశేఖర్(34) అతడి బంధువు కన్నప్ప(42) కలిసి ద్విచక్రవాహనంలో దప్పువాయిద్యాలు తీసుకుని మదనపల్లెకు వస్తున్నారు. మార్గమధ్యంలోని పుంగనూరు మండలం సుగాలిమిట్ట వద్ద వాహనం అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

మృతుడి కుటుంబీకులకు మాజీ మంత్రి పరామర్శ



ఆవుల కుటుంబీకులను పరామర్శిస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సంబేపల్లె : వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, దేవపట్ల సర్పంచ్ ఆవుల వేణుగోపాల్‌రెడ్డి మృతి పార్టీకి తీరనిలోటు అని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఇటీవల వేణుగోపాల్ రెడ్డి మృతిచెందిన విషయం తెలుసుకున్న ఆయన ఆవులవాండ్లపల్లెకు చేరుకొని మృతుడి కుటుంబీకులు ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డిలను పరామర్శించారు. అనంతరం విష్ణువర్ధన్‌రెడ్డి నివాసంలో నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి ప్రతి నాయకుడు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపేంద్రనాద్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వీవీ.ప్రతాప్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, వీవీ.రమణారెడ్డి, అశోక్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రఘునాథరెడ్డి, రామచంద్ర, మల్లికార్జునరెడ్డి, రమణారెడ్డి, అన్నారెడ్డి, బుజ్జిరెడ్డి, యువరాజ్‌నాయుడు, చరణ్‌కుమార్‌రెడ్డి, విశ్వశ్వేతనాథ్‌రెడ్డి, శివారెడ్డి, వెంకట్రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దుబాయి దీనార్లు ఇస్తామని టోకరా

చంద్రగిరి : దుబాయి దీనార్లు తక్కువ ధరకే ఇస్తానని చెప్పి ఓ వ్యక్తి రూ.5 లక్షలు కాజేసిన ఘటన బుధవారం తిరుపతి జిల్లా చంద్రగిరిలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే.. పీలేరుకు చెందిన సలీం బాషా అగరబత్తీల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. కొద్దిరోజుల క్రితం ఓ వ్యక్తి సలీం బాషా దుకాణం వద్దకు వెళ్లాడు. తన వద్ద దుబాయి దీనార్లు ఉన్నాయని, తక్కువ ధరకు ఇస్తానని, కావాలంటే ఒక దీనార్ ఇస్తాను పరిశీలించుకోమని నమ్మబలికాడు. అత్యాశకు పోయిన సలీం బాషా ఆ వ్యక్తి మాట నమ్మి, ఫోన్‌లో తరచూ మాట్లాడుతూ వస్తున్నాడు. ఈ క్రమంలో తనకు రూ.5 లక్షలకు దీనార్లు కావాలని సలీం బాషా ఫోన్‌లో కోరారు. గురువారం చంద్రగిరి లైబ్రరీ వద్దకు నగదుతో వస్తే రూ.5 లక్షలకు దీనార్లను అందిస్తానని గుర్తుతెలియని వ్యక్తి చెప్పాడు. అలాగే చంద్రగిరికి చేరుకున్న బాధితుడు, ఆ వ్యక్తికి రూ.5 లక్షల నగదును అందించాడు. తిరిగి ఆ వ్యక్తి ఓ బ్యాగు ఇచ్చాడు. ఆ బ్యాగును ఇక్కడ తెరవకుండా ఇంటికి తీసుకెళ్లి చూసుకోవాలని తెలిపి వెళ్లిపోయాడు. కొంత సేపటికి బ్యాగు తెరిచి చూడగా అందులో న్యూస్ పేపర్లు ఉండడంతో తాను మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు వెంటనే మోసం చేసిన వ్యక్తికి ఫోన్ చేయగా..అది స్విచ్ ఆఫ్ వచ్చింది. ఘటన స్థలానికి వెళ్లి పరిసరాల్లో సీసీ కెమెరాలను పరిశీలించినా ఏమీ లభ్యం కాలేదు. దీంతో తన నగదు ఎక్కడ ఇచ్చాడో సరైన వివరాలు చెప్పాలని పోలీసులు సలీం బాషాకు సూచించారు. లేకుండా పరిసరాల్లో సీసీ కెమెరాల ఫుటేజ్ ఉంటే తీసుకురావాలని సలహా ఇవ్వడంతో సలీం అక్కడ నుంచి వెనుదిరిగాడు. అయితే ఈ ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

పోలీస్ స్టేషన్‌లో యువకుడి దురుసు ప్రవర్తన

అసభ్య పదజాలంతో ఎస్‌ఐ, పోలీస్ సిబ్బందిపై దూషణ

నిమ్మనపల్లె : వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఓ యువకుడు పోలీస్ స్టేషన్‌లోనే ఎస్‌ఐ, పోలీస్ సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించి అసభ్య పదజాలంతో దూషించిన సంఘటన గురువారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. యువకుడిపై కేసు నమోదు చేసినట్లు మదనపల్లె డీఎస్పీ మహేంద్ర, రూరల్ సీఐ సత్యనారాయణ తెలిపారు. వారి వివరాల మేరకు.. కొండయ్యగారిపల్లె పంచాయతీ వెంకోజీగారిపల్లె దాసరిపేటకు చెందిన వెంకటరమణ కుమారుడు తుపాకుల రోహిత్ కుమార్(30) కర్ణాటకలో నర్సరీ నిర్వహిస్తున్నాడు. వినాయక చవితి సందర్భంగా మంటపం వేసి వినాయకుని ప్రతిష్ఠించారు. గురువారం మధ్యాహ్నం మండపాల వద్ద డీజేలతో అశ్లీల నృత్యాలు చేయించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎస్‌ఐ తిప్పేస్వామి మధ్యాహ్నం పోలీస్ స్టేషన్‌కు నిర్వాహకులను పిలిపించారు. వారితో కలిసి రోహిత్ కుమార్ పోలీస్ స్టేషన్‌కు వచ్చాడు. ఎస్‌ఐ వారితో మాట్లాడుతూ మండపం ఏర్పాటుకు అనుమతులు ఇచ్చే సమయంలోనే డీజే, అశ్లీల నృత్యాలు నిషేధమని, నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని సూచించామన్నారు. ఆదేశాలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే సమయంలో నిర్వాహకుల వెంట వచ్చిన రోహిత్‌కుమార్ (30) తాము డీజేకు, డాన్సులు ఆడే వారికి అడ్వాన్సులిచ్చామని, డాన్సు వేయిస్తామని ఎస్‌ఐతో వాగ్వాదానికి దిగాడు. పోలీసులు వారించినా వినకుండా విచక్షణ కోల్పోయి, ఎస్‌ఐ, పోలీసులపై అసభ్య పదజాలంతో దుర్భాషలాడారు. సమాచారం అందుకున్న డీఎస్పీ మహేంద్ర, రూరల్ సీఐ సత్యనారాయణ నిమ్మనపల్లి పోలీస్ స్టేషన్ కు వచ్చి కారణాలను విచారించారు. దురుసుగా ప్రవర్తించిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీపై విచారణ

ప్రొద్దుటూరు రూరల్ : రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీపై గురువారం విచారణ చేపట్టినట్లు తహసీల్దారు గంగయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పార్టీ కార్యాలయం గతంలో వసంతపేటలోని 22/160 ఇంటిలో ఉండేదని, ప్రస్తుతం రాజేశ్వరీకాలనీలోని 19/280-148-1 ఇంటిలోకి మార్చబడిందని గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పార్టీ అభ్యర్థి 2009, 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో నామినేషన్ వేశారని, ప్రస్తుతం క్రియాశీలకంగా ఉందని తన విచారణలో తేలిందన్నారు. పార్టీ రద్దు తాను ఎక్కడా ప్రకటించలేదని తెలిపారు. భారతీయ సధర్మ సంస్థాపన పార్టీ నాయకులకు నోటీసు అందించామని, వారు రాష్ట్ర ప్రధాన ఎన్నికల ప్రధాన కార్యక్రమంలో హాజరు కావాల్సి ఉంటుందన్నారు.

సీసీ దారి నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

రాయచోటి టౌన్ : పట్టణంలోని వివిధ ప్రాంతాలలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు రాష్ట్ర రవాణా, క్రీడల, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి బుధవారం భూమి పూజ చేశారు. మున్సిపాల్టీ పరిధిలో రూ.3.50 కోట్లతో 36 పనులు ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం మాండవ్య నది మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.30 లక్షలు నిధులు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాయచోటి మున్సిపాల్టీని రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలుపుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి, పాల్గొన్నారు.

జీవ శాస్త్రంపై అంతర్జాతీయ సదస్సు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రవీంద్రనాథ్

కడప ఎడ్యుకేషన్ : కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి)లో సమగ్ర జీవశాస్త్రం మరియు ఔషధ శాస్త్రంపై గురువారం అంతర్జాతీయ సదస్సు జరిగింది. జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ జీవశాస్త్రంతో కలిగే ప్రయోజనాలను తెలిపారు. అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ డాక్టర్ తులసి మానవుల్లో వచ్చే వ్యాధులకు చికిత్స, డాక్టర్ రాజేష్ కుమార్ ఈ వ్యర్థాల నిర్వహణ, డాక్టర్ భూపేష్ ఆధునిక జీవశాస్త్రం అభివృద్ధిపై, డాక్టర్ సంజయ్ గర్భాశయ క్యాన్సర్‌పై వివరించారు. వీరనాగేంద్రకుమార్, రమేష్, పి.రవిశేఖర్, నీలయ్య, నాగేశ్వరరెడ్డి, జమాల్‌బాషా, రామచంద్ర, మహేష్, పి.నవనీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

లారీ ఢీకొని ప్రైవేటు ఉద్యోగి దుర్మరణం



దుర్మరణం పాలైన జాన్

మదనపల్లె రూరల్ : ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొని ప్రైవేటు ఉద్యోగి దుర్మరణం చెందిన సంఘటన గురువారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. తెలంగాణా రాష్ట్రం గద్వాలకు చెందిన జాన్ (30) వాల్మీకిపురంలో ఉంటూ టెలికాం కేబుల్ పనులు చేస్తున్నాడు. గురువారం రాత్రి వాల్మీకిపురం నుంచి మదనపల్లె వస్తుండగా మార్గమధ్యంలో కాశీరావుపేట వద్ద లారీ వేగంగా వచ్చి ఢీకొంది. తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే దుర్మరణం పాలయ్యాడు. తాలూకా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



మృతి చెందిన గంగాదేవి

మదనపల్లె రూరల్ : మిద్దెపై నుంచి ప్రమాదవశాత్తూ జారిపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. కోళ్లబైలు పంచాయతీ డీవీ.జగన్ కాలనీకి చెందిన రామకృష్ణ భార్య గంగాదేవి(53) ఈ నెల 23న మిద్దెపై నుంచి కిందకు దిగుతుండగా ప్రమాదవశాత్తు జారి పడి తీవ్రంగా గాయపడింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు సీఐ తెలిపారు.

గాయపడిన వ్యక్తి..



కోట ఆచారి

కలకడ : లారీ ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతిచెందినట్లు ఎస్‌ఐ బి.రామాంజనేయులు తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. కలకడ మండలం గొళ్లపల్లెకు చెందిన కోట ఆచారి(80) సంతలో కూరగాయలు కొని రోడ్డు దాడుతున్న సమయంలో ఐచర్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో క్షతగాత్రుడు కోట ఆచారిని 108లో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినటుల్ ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు దుర్మరణం

కడప అర్బన్: కడప నగరంలోని బాలాజీ నగర్ వినాయక మండపం వద్ద విద్యుత్ షాక్ తగిలి సుమన్‌తేజ(19) మృతి చెందారు. కడప తాలూకా ఎస్‌ఐ తులసీ నాగ ప్రసాద్‌కు యువకుడి తల్లిదండ్రులు ఆనందరావు, అరుణ కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సుమతేజ తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అతడు ఇంటర్ వరకు చదువుకుని కేటరింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 27న రాత్రి వినాయకచవితి పండుగ సందర్భంగా తనతోపాటు కేటరింగ్ పనులను నిర్వహించే స్నేహితుడు పిలవడంతో బాలాజీనగర్‌కు వెళ్లాడు. మండపం వద్ద తాను వర్షానికి తడిసిపోవడంతోపాటు, సంఘటనా స్థలంలో బాగా తడిచేరింది. ఈ క్రమంలో సెల్‌ఫోన్ ఛార్జింగ్ పెట్టేందుకు సుమన్‌తేజ ప్రయత్నించారు. ఆ సమయంలోనే విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ..

జమ్మలమడుగు రూరల్ : మండలంలోని మోరగుడి గ్రామానికి చెందిన పల్లా రాజేశ్వరి(70) బుధవారం రాత్రి వినాయక విగ్రహాన్ని దర్శించుకుని ఇంటికి వెళ్తున్నారు. రచ్చబండ సమీపానికి చేరగానే జమ్మలమడుగు నుంచి మైలవరం వైపు వెళ్తున్న కారు ఢీకొంది. డాక్టర్లు మృతి చెందినట్లు తెలిపారు.

పెట్రోల్ బంక్ సొమ్ము కేసులో విచారణ వేగవంతం

రూ.65 లక్షల స్వాహాపై డీపీటీఓ ఫిర్యాదు



రాజంపేటలోని ఆర్టీసీ నిర్వహిస్తున్న పెట్రోలు బంక్

రాజంపేట : రాజంపేట ఆర్టీసీ పెట్రోలు బంక్‌లో పక్కదారి పట్టిన సొమ్ము కేసులో విచారణవేగవంతమైంది. రూ.65 లక్షలు నిధుల స్వాహా అయినట్లు నిర్ధారణ చేసుకొని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుకు ఆర్టీసీ డీపీటీఓ రాము విచారణ చేపట్టి ఫిర్యాదుచేశారు. ఎస్పీ ఆదేశాలతో టౌన్ సీఐ నాగార్జున విచారణ చేసి ఆర్టీసీ డిపో ఉద్యోగులు పీఆర్ నాయుడు, పీఎల్ నరసారెడ్డిలతోపాటు, పెట్రోలు బంకులో పనిచేసే 29 మందిపై కేసు నమోదు చేశారు. 9 నెలల పాటు పెట్రోలు బంకు నిర్వహణలో రూ.65,15,607 నిధులు స్వాహా అయినట్లు విచారణ అధికారులు తేల్చారు.

ఎలా జరిగిందంటే..

రాజంపేట ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఉన్న స్థలాన్ని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు లీజుకు ఇచ్చారు. అగ్రిమెంట్ చేసుకొని పెట్రోలు బంకు ఏర్పాటుచేశారు. గత ఊడాది డిసెంబర్ 7న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దీనిని ప్రారంభించిన సంగతి విదితమే. అద్దెను చెల్లిస్తూ బంకు నిర్వహణకు ఆర్టీసీ డిపో ఉద్యోగి రాజశేఖర్‌నాయుడును నియమించారు. పెట్రోలు పట్టేందుకు నంద్యాలకు చెందిన చంద్రమోహన్‌కు కాంట్రాక్టు ఇచ్చారు. దీంతో తొమ్మిది మంది ఇంజినీరింగ్ విద్యార్థులు, మరో 20 మంది స్థానిక సిబ్బందిని నియమించుకున్నారు. ఈ నేపథ్యంలోనే కొందరు నిర్వహణ విషయంలో అక్రమాలకు పాల్పడ్డారు. తొమ్మిది నెలల పాటు అప్పనంగా రూ.25 లక్షల వరకు స్వాహా చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా రికార్డులో నమోదు చేశారు. ప్రతి రోజు బంక్‌లో వచ్చిన మొత్తం రాజంపేట ఎస్‌బీఐ అకౌంట్‌లో జమచేశారు. ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న శోభ వద్ద నగదు హ్యాండోవర్ చేస్తే ఆమె ఆ మరుసటి రోజుఆ బ్యాంకులో జమ చేస్తారు. పెట్రోలు బంకు నిర్వహణకు డీజిల్ స్టాకు ఇండెంట్ కావాలంటే ఆర్టీసీ డీఎం రాయచోటి ఏటీ లోకనాథుడికి ఇండెంట్ పంపిస్తారు. ఇండెంట్ ప్రకారం ఫండ్సు విడుదల చేశారు. మొత్తాన్ని చెక్కు రూపంలో ఐఓసీఎల్ కంపెనీకి పంపిస్తారు. స్టాక్ తెప్పిచ్చి బంక్‌లో లోడింగ్ చేశారు. దీంతో ఇంజినీరింగ్ విద్యార్థులు, కాంట్రాక్టరు కుమ్మక్కై స్కానర్లు మార్చడంతోపాటు ఫోన్‌పే, గూగుల్‌పే డిజిటల్ పేమెంట్‌లో పకడ్బందీగా రిజిష్టర్‌లో నమోదు చేసి లెక్కలు సరిపోయే విధంగా చూపించారు. ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఈ నిధుల స్వాహాకు తెరలేశారు. రోజూ ఉదయం ఆరు గంటలకే బంక్‌లో డిప్‌డెన్సిటీ క్వాలిటీ రీడింగ్ చేసుకోవాలి. ఈ సమయంలో బంకులో ఎంత స్టాక్ వుందనేది పరిశీలించుకోవాలి. ఈ విధంగా చేయకపోవడం వల్ల మొత్తం మీద రూ.65 లక్షలు స్వాహా కావడానికి దారితీసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.